క్లుప్తంగా

ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన



నందిగామటౌన్(నందిగామరూరల్): ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య తెలిపారు. పట్టణంలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో రూ.1.30 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులకు గురువారం ఆమె శంకుస్థాపన చేశారు. తొలుత స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటానని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి, నాయకులు పాల్గొన్నారు.

మంచినీటికి ఇబ్బంది లేకుండా చర్యలు : ఆకుల



నందిగామరూరల్:రానున్న వేసవి దృష్ట్యా తాగు, వాడుక నీటికి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీపీ ఆకుల హనుమంతరావు తెలిపారు. మండలంలోని అడవిరావులపాడులో నిర్వహిస్తున్న బోరు పంపు మరమ్మతు పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వేసవిలో మండల ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

తల్లులకు ఘనసత్కారం



నందిగామటౌన్(నందిగామరూరల్): అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలను పురస్కరించుకుని కష్టపడి జీవితంలో ఎదిగిన తల్లులను గురువారం ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా ఇన్‌చార్జి సీడీపీఓ కృష్ణకుమారి మాట్లాడుతూ పిల్లలను ప్రయోజకులుగా తీర్చిదిద్దడంలో తల్లులది కీలకపాత్ర అని పేర్కొన్నారు. అనంతరం విశ్రాంత ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దుర్గాదేవిని ఘనంగా సత్కరించారు. సూపర్‌వైజర్లు కరుణకుమారి, తారాబి, వెంకట్రావమ్మ, అంగనవాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అదుపు తప్పి లారీ బోల్తా



అల్లూరు(వీరులపాడు): లారీ అదుపు తప్పి బోల్తా పడిన ఘటనలో డ్రైవర్, క్లీనర్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. సేకరించిన సమాచారం మేరకు మండలంలోని అల్లూరు గ్రామం నుంచి మొక్కజొన్న లోడు లారీ హైదరాబాద్ వెళ్తుంది. ఈ క్రమంలో జుజ్జూరు గ్రామ సమీపంలోని తోటమూల వద్దకు వచ్చేసరికి అదుపు తప్పి లారీ బోల్తా పడింది. ఈ ఘటనలో లారీలోని డ్రైవర్, క్లీనర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

యువకుడిపై కేసు నమోదు



పెనుగంచిప్రోలు: మహిళతో అసభ్యంగా ప్రవర్తించాడంటూ అందిన ఫిర్యాదుపై పోలీసులు ఓ వ్యక్తిపై కేసు నమోదు చేశారు. గ్రామానికి చెందిన బత్తుల గోపాలరావు ఓ మహిళ పట్ల గురువారం అసభ్యంగా ప్రవర్తించాడంటూ ఆమె కుటుంబసభ్యులు అతన్ని తాళ్లతో కట్టేసి కొట్టారు. ఈ ఘటనలో గాయపడిన అతన్ని స్థానికులు పెనుగంచిప్రోలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సదరు మహిళ ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఈ మేరకు అతనిపై కేసు నమోదు చేశారు. అయితే తాను ఆమె కుటుంబసభ్యులకు ఇచ్చిన డబ్బులు అడిగేందుకు వెళ్లగా తనపై దాడి చేశారంటూ గోపాలరావు చెబుతున్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగాలి

కృష్ణలంక(విజయవాడతూర్పు): మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగాలని కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవ భవన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని గురువారం ఎం.బి.విజ్ఞాన కేంద్రం, ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్, సేఫ్, తరుణి తరంగాలు, భారత మహిళామండలి, జనశిక్షణ సంస్థాన్, సృహోప్తి, సమన్విత సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో చిత్రలేఖనం పోటీలు, అభ్యుదయ గీతాలు, కవితల పోటీలు జరిగాయి. ముఖ్య అతిథి ఆంజనేయులు పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎం.బి.విజ్ఞాన కేంద్రం బాధ్యులు, పి.వి జయ, పావని, గీత, నందిని, సేఫ్ బాధ్యులు ఉషారాజా, శేషు, తరుణీతరంగాలు బాధ్యులు శ్రీదేవి, జనశిక్షణ సంస్థాన్ పూర్ణిమ పాల్గొన్నారు.



కంచికచర్లలో శ్లాబ్ దశలో నిలిచిన అంగనవాడీ కేంద్రం పనులు



కంచికచర్లలో అసంపూర్తిగా మిగిలిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్ సెంటర్



పేరకలపాడులో నిలిచిన రైతుభరోసా కేంద్రం భవనం పనులు

ప్రభుత్వ భవనాలకు కూటమి గ్రహణం

- గ్రామాల్లో నిలిచిన ప్రభుత్వ భవనాల పనులు..
- పదినెలలుగా ముందుకు సాగని వైనం
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కూటమి ప్రభుత్వం
- నిరుపయోగంగా మారుతున్న ప్రజాధనం



గండేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిలిచిన అదనపు తరగతి గదుల నిర్మాణాలు

కంచికచర్ల: ప్రభుత్వ భవనాల నిర్మాణ పనులకు పదినెలలుగా కూటమి గ్రహణం పట్టింది. కోట్లాది రూపాయల ప్రజాధనం వెచ్చించి చేపట్టిన ఆయా భవన నిర్మాణాల పనులను పూర్తిచేయడంలో సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. దీంతో ఆయా ప్రభుత్వ భవన నిర్మాణ పనులు పదినెలలుగా ఎక్కడికక్కడే నిలిచిపోయి మొండి గోడలే దర్శనమిస్తున్నాయి.

గ్రామాల్లోనే పౌరసేవలు అందించేలా..

అన్నిరకాల ప్రభుత్వ సేవలు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల్లో ప్రభుత్వ భవన నిర్మాణాలను ప్రారంభించారు. నాటి ప్రభుత్వం గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు(ప్రస్తుతం రైతుసేవా కేంద్రాలు) విలేజ్ హెల్త్ క్లినిక్, పాఠశాల అదనపు తరగతి గదులు తదితర భవన నిర్మాణాలను పెద్ద ఎత్తున చేపట్టింది. గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్యంను సాకారం చేస్తూ ఉన్న ఊర్లోనే అన్ని ప్రభుత్వ సేవలు అందించేందుకు వీలుగా ఆయా ప్రభుత్వ కార్యాలయ భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టా పనులను వేగవంతం చేసింది. ఈక్రమంలో సార్వత్రిక ఎన్నికల అనంతరం అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం ఆయా పనులను కొనసాగించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. దీంతో పదినెలలుగా ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి.

నిధులు కేటాయించని కూటమి ప్రభుత్వం..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నందిగామ నియోజకవర్గంలోని కంచికచర్ల, నందిగామ, వీరులపాడు, చందర్లపాడు మండలాలకు గ్రామ సచివాలయాలు 65, రైతుభరోసా కేంద్రాలు 65, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ సెంటర్లు 48 మంజూరయ్యాయి. వీటిలో 47గ్రామ సచివాలయాలు, 27ఆర్‌బీకేలు, 23 వెల్‌నెస్ సెంటర్ల పనులను వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పూర్తయ్యాయి. మిగిలిన ఆయా భవనాల పనులు వివిధస్థాయిలో ఉన్నాయి. 104 అదనపు తరగతి గదుల నిర్మాణాల్లో అధికశాతం పనులు పూర్తయ్యాయి. కాని మిగిలిన ఈ పనులను పూర్తిచేసేందుకు మాత్రం కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. దీంతో ఆయా పనుల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా తయారైంది. ఇకనైనా కూటమి ప్రభుత్వ పాలకులు స్పందించి అసంపూర్తిగా మిగిలిన పనులను త్వరితగతిన పూర్తిచేసి ప్రజాధనం నిరుపయోగంగా మారకుండా చూడాలని నందిగామ నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.

సచివాలయం లేక ఇక్కట్లు...



మా గ్రామంలో సచివాలయానికి సొంత భవనం లేకపోవడంతో సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. పంచాయతీ భవనంలోనే సచివాలయాన్ని నిర్వహిస్తున్నాం. ఆగిపోయిన నిర్మాణాలను కొత్త ప్రభుత్వం ఎప్పుడు మొదలు పెడుతోందో అర్థం కావడం లేదు. త్వరితగతిన నిధులు కేటాయించి నిర్మాణాలు పూర్తిచేయాలి.

– బొక్కా రవికుమార్, గండేపల్లి సర్పంచి, కంచికచర్ల మండలం

పనులు పూర్తి చేస్తే మేలు...



నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో చేపట్టిన ప్రభుత్వ భవన నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేస్తే ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుంది. ఇప్పటివరకు ఆయా భవన నిర్మాణాల కోసం ఖర్చుచేసిన డబ్బులు వృథా కాకుండా ఉంటుంది. ఆదిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుని భవన నిర్మాణపు పనులను పూర్తిచేయించాలి.

– మురుమూరి పాండురంగారావు, కంచికచర్ల

ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదు...

నియోజకవర్గంలో 65గ్రామ సచివాలయాలకు 47పూర్తయ్యాయి. ఆర్‌బీకేలు 65కు గానూ 27, వెల్‌నెస్ సెంటర్లు 48కి గానూ 23 పూర్తయ్యాయి. మిగిలిన భవన నిర్మాణాల పనులు వివిధ దశల్లో నిలిచిపోయాయి. నిర్మాణాల కొనసాగించేందుకు మాకు ప్రభుత్వం నుంచి ఇంతవరకూ ఎటువంటి ఆదేశాలు రాలేదు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తాం.

– శ్రీనివాసరావు పీఆర్ డీఈఈ, నందిగామ

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ



ధర్మవరప్పాడుతండ(జగ్గయ్యపేట):నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని ఎస్ఐ తోట సూర్య శ్రీనివాస్ పేర్కొన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటు ఆవశ్యకత, ఉపయోగాలపై ధర్మవరప్పాడు తండ వాసులకు గురువారం ఆయన అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాల నియంత్రణ, శాంతిభద్రతలు కాపాడేందుకు సీసీ కెమెరాలు ఎంతో దోహదపడతాయన్నారు. మండలంలోని అన్ని గ్రామాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే ధర్మవరప్పాడుతండ, జయంతిపురం, వేదాద్రి, షేర్‌మహ్మద్‌పేట, బలుసుపాడు, బూదవాడ, తిరుమలగిరి గ్రామాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. మిగిలిన గ్రామాల ప్రజలు, ప్రజా ప్రతినిధులు ముందుకు వచ్చి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ఇళ్లకు తాళాలు వేసి ఇతరప్రాంతాలకు వెళ్లేవారు పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

విద్యార్థులకు బహుమతులు



జగ్గయ్యపేట అర్బన్: ఎస్ఎఫ్ఐ-యూటీఎఫ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన పదోతరగతి మోడల్ పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు నిర్వాహకులు గురువారం స్థానిక జీఆర్‌సీ జూనియర్ కళాశాలలో బహుమతులు అందజేశారు. పేట మండల స్థాయిలో వెన్నెల కీర్తిక(చేగు విద్యాలయం)ప్రథమ స్థానం, ద్వితీయ స్థానంలో గోపిచంద్(చేగు)ద్వితీయ, నవతేజ(తపోవన్)తృతీయ స్థానంలో నిలిచారు. వీరితోపాటు ప్రతి పాఠశాల నుంచి ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జీఆర్‌సీ విద్యా సంస్థల కరస్పాండెంట్ పెనుగొండ వెంకటరాజీవ్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కేఎస్.రమేష్, లైఫ్ స్కిల్స్ ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు జి.గోపినాయక్, జిల్లా బాలికల కన్వీనర్ షేక్ జాహిదా, ఎస్ఎఫ్ఐ పేట మండల అధ్యక్షుడు ప్రణయ్‌తేజ తదితరులు అందజేశారు.

బీసీల సంక్షేమానికి జగనన్న కృషి : తన్నీరు



రాధమ్మ, మున్నీహీరాను సన్మానిస్తున్న తన్నీరు నాగేశ్వరరావు, నాయకులు

జగ్గయ్యపేటఅర్బన్: బీసీలంటే బ్యాక్ వర్డ్ కాదు, బ్యాక్ బోన్ అని ఆచరణలో అమలుచేసి చూపించిన ఘనత మాజీముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు అన్నారు. రాష్ట్ర బీసీ చైతన్య సంక్షేమ సంఘం అధ్యక్షురాలిగా నియమితులైన పోలంపల్లి రాధమ్మ, జిల్లా అధ్యక్షురాలిగా నియమితులైన వైఎస్సార్ సీపీ మహిళా విభాగం పట్టణ అధ్యక్షురాలు షేక్ మున్నీహీరాకు స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం అభినందనసభ నిర్వహించారు. పార్టీ నాయకులు, బీసీ నాయకులు కలిసి రాధమ్మ, మున్నీహీరాను ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గతంలో తనపాలనలో బీసీలకు అన్ని రంగాలలో అధిక ప్రాధాన్యత నిచ్చి వారి ఆత్మగౌరవాన్ని పెంచారన్నారు. తద్వారా సామాజిక సమన్యాయం పాటించి భావితరాలకు స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. మళ్లీ బీసీలంతా ఏకమై పార్టీకి అండగా నిలిచి, పార్టీ గెలుపునకు కష్టపడి పనిచేసి పూర్వవైభవం తీసుకురావాలని కోరారు. రాధమ్మ, మున్నీహీరా సమన్వయంతో అందరిని కలుపుకొని మహిళలు పార్టీ కార్యక్రమాల్లో భాగస్వాములు అయ్యేలా కృషి చేయాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల్లో మహిళలకు ఎన్నో హామీలు ఇచ్చి నేడు వారిని దారుణంగా మోసం చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ కూటమి ప్రభుత్వం బండారాన్ని మహిళలందరికీ తెలియజేయాలని, బీసీలందరిని ఐక్యపరిచి పార్టీ బలోపేతానికి కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ విభాగం ప్రధాన కార్యదర్శి బత్తుల రామారావు, జిల్లా కార్యదర్శులు వేముల మల్లేశ్వరరావు, మాతంగి నాగబాబు, పట్టణ, మండల అధ్యక్షులు వట్టెం మనోహర్, బూడిద నరసింహారావు, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసగౌడ్, న్యాయవాదులు పి.సత్యశ్రీనివాసరావు, శివరాత్రి పృథ్వీ, గొనెల వెంకటేశ్వర్లు, మండల సమాఖ్య మాజీ అధ్యక్షురాలు ధరావత్ శ్యామల, బీసీ సంఘ నేత అల్లి శివకుమారి, పార్టీ పట్టణ యూత్ ప్రధాన కార్యదర్శి గొట్టిపాళ్ల సురేష్, నాయకులు గొట్టిపాటి బుల్లియ్య, గుంజ ఆశీర్వాదం పాల్గొన్నారు.

పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు చేయాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్



మాట్లాడుతున్న దోనేపూడి శంకర్ తదితరులు

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట ప్రాంతాన్ని పారిశ్రామిక కారిడార్‌గా ఏర్పాటు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ కోరారు. స్థానిక కోదాడ రోడ్డులోని సీపీఐ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జగ్గయ్యపేట ప్రాంతంలోని ఆయా ఫ్యాక్టరీల్లో పనిచేసే కాంట్రాక్టు కార్మికులు శ్రమదోపిడీకి గురవుతున్నారన్నారు. వీరికి రక్షణ పరికరాలు, పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయాలు కూడా కల్పించడం లేదన్నారు. ఈ విషయంపై ప్రభుత్వం వద్ద స్పష్టమైన గణాంకాలు ఉన్నాయా? అని ప్రశ్నించారు. పేట ప్రాంతంలో మితిమీరిన స్థాయిలో సాగుతున్న సున్నపురాయి, గనుల త్రవ్వకాలపై ప్రభుత్వం అదనపు రాయల్టీని, ఫెనాల్టీని విధిస్తుందే తప్ప పర్యావరణ పరిరక్షణను గాలికి వదిలేసిందన్నారు. ఇప్పటికైనా స్థానిక నాయకులు కర్మాగారాల్లో కాంట్రాక్టులపై దృష్టి పెట్టడం కంటే పర్యావరణ పరిరక్షణపై శ్రద్ధ పెట్టి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని కోరారు. కార్మికుల కోసం ఆయా ఫ్యాక్టరీలు ఇళ్లు, సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రులు నిర్మించేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బుట్టి రాయప్ప, జిల్లా చేతివృత్తుల సంఘం అధ్యక్షుడు తాడి పైడయ్య, జిల్లా నాయకులు కొట్టు రమణారావు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కరిసె మధు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి అంబోజి శివాజి, ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు పోతిపాక వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి బాబురావు, పట్టణ సహాయ కార్యదర్శి మాశెట్టి రమేష్, నాయకులు షేక్ అసదుల్లా, భోగ్యం నాగులు, మెటికల శ్రీను, షేక్ జాని, మస్తాన్ పాల్గొన్నారు.

రూ. లక్ష విలువైన మూడు వెండి కిరీటాలు వితరణ



మధురానగర్(విజయవాడసెంట్రల్): సత్యనారాయణపురం రైల్వేకాలనీలోని శివకేశవ దేవాలయంలో గురువారం సినీ నటి సురేఖవాణి కుటుంబ సభ్యులతో కలిసి రూ. లక్ష విలువ చేసే మూడు వెండి కిరీటాలను ఆలయానికి అందజేశారు. ఆమె మాట్లాడుతూ ఎంతో మహిమాన్వితమైన ఆలయంలోని సాయిబాబా, అయ్యప్పస్వామి, వేంకటేశ్వర స్వామికి వెండి కిరీటం తయారు చేయించి అందజేస్తున్నట్లు తెలిపారు.భక్తితో సేవిస్తే సకల కష్టాలు తీరుతాయన్నారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ శరణ్‌స్వామి ఆధ్వర్యాన ప్రత్యేక పూజలు నిర్వహించి వెండి కిరీటాలు అలంకరించారు అనంతరం 300 మందికి అన్నప్రసాద వితరణ జరిగింది. ఆలయకమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు అమ్మవారి చీరలకు వేలం

నందిగామరూరల్: మండలంలోని లింగాలపాడులో వేంచేసియున్న లక్ష్మీపేరంటాళ్ల అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరలకు శుక్రవారం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ నరసింహమూర్తి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్నం రెండు గంటలకు ఆలయ ఆవరణలో నిర్వహించే ఈ వేలంలో ఆసక్తిగలవారు పాల్గొనాలని ఆయన కోరారు.

పైపులైన్ పనులు అడ్డుకున్న రైతులు



వీరులపాడు: మండలంలోని నందలూరు శివారు వైరాకట్టలేరు సమీపంలో కంచికచర్ల మండలం గండేపల్లి గ్రామంలోని సెంథిని కర్మాగారం చేపడుతున్న అక్రమ పైపులైను నిర్మాణ పనులను గురువారం గండేపల్లి, నందలూరు గ్రామాల రైతులు అడ్డుకున్నారు. ప్రాణత్యాగం చేసైనా సరే పైపులైను ఏర్పాటును అడ్డుకుంటామని రైతులు, గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ మున్నేరు వద్ద పైపులైన్ ఏర్పాటుకు అనుమతులు తీసుకుని వైరాకట్టలేరు వద్ద ఏర్పాటు చేయటమేంటని ప్రశ్నించారు. 2023లో కలెక్టర్ తమకు అనుమతులు ఇచ్చారని కంపెనీ ప్రతినిధులు చెబుతూ రైతులను ఇబ్బంది పెడుతున్నారన్నారు. గ్రామంలోని రైతులు, రైతు కమిటీలు, భూయజమానులతో చర్చించకుండా ఇష్టానుసారం పైపులైన్‌లు ఏర్పాటు చేస్తే సహించేది లేదన్నారు. అధికారులు, పాలకులు రైతుల పక్షాన నిలిచి అక్రమ పైపులైన్ నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న నందిగామ రూరల్ సీఐ చవాన్, ఎస్ఐ రాజు, డిప్యూటీ తహసీల్దార్ నాగరాజు, ఆర్ఐ సంధ్య సంఘటనాస్థలానికి చేరుకుని రైతులు, కంపెనీ ప్రతినిధులతో చర్చించారు. పైపులైన్ ఏర్పాటు చేసే ప్రాంతంలో రైతుల భూమి ఉన్నందున పనులను నిలుపుదల చేయాలని కంపెనీ ప్రతినిధులకు తెలిపడంతో వివాదం సద్దుమణిగింది. కార్యక్రమంలో రైతులు చంద్ర వెంకటేశ్వరరావు, బెల్లంకొండ కోటేశ్వరరావు, బెల్లంకొండ రోశమ్మ, బెల్లంకొండ రాజేంద్రప్రసాద్,, రేపూడి రాము, నాగార్జున, ఏలూరు వేణు, సాంబశివరావు పాల్గొన్నారు.

రేపట్నుంచి ప్రతిష్టా మహోత్సవాలు



మక్కపేట(వత్సవాయి):గ్రామంలో నూతనంగా నిర్మాణం చేసిన శ్రీపార్వతీ సమేత కాశీవిశ్వేశ్వర స్వామి వారి ఆలయ ప్రతిష్టా మహోత్సవాలను ఈనెల 8వతేదీ నుంచి పదితేదీ వరకు నిర్వహించనున్నట్లు ఈఓ హెచ్ హరిదుర్గానాగేశ్వరరావు తెలిపారు. 8వతేదీ శనివారం దంపతులచే యాగశాల పూజ, విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచనం, దీక్షాధారణ, యాగశాల బలిహారణ, 9న గవ్యాంతపూజ, వాస్తుపూజ, వాస్తుహోమం, వాస్తుబలి, క్షీరాభిషేకం, పంచశయ్యాధివాసం, 10న యంత్రపూజ, గర్తన్యాసం, మహాపూర్ణాహుతి, అగ్నిప్రదక్షిణం, శివపార్వతుల శాంతికల్యాణం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 6.55 నిమిషాలకు విగ్రహాలను ప్రతిష్ఠించనున్నట్లు వివరించారు. గంగమ్మ, పోతురాజుల విగ్రహాలనుఎ ప్రతిష్ఠించనున్నట్లు తెలిపారు. కాగా శిథిలావస్థకు చేరిన ఈ ఆలయ మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని గ్రామస్తులు దరఖాస్తు చేసుకోవడంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.50లక్షలను మంజూరు చేసింది. ఈనిధులతో చేపట్టిన పనులు పూర్తి చేసి, ప్రతిష్టా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

ముత్యాలమ్మకు పూజలు..

ఆలయ ప్రతిష్టా మహోత్సవాలను పురస్కరించుకుని గ్రామస్తులు గురువారం ముత్యాలమ్మ, బొడ్రాయికి ప్రత్యేకపూజలు చేశారు. పసుపు, కుంకుమ కలిపిన నీటిబిందెలతో మహిళలు బొడ్రాయి వద్దకు చేరుకుని ఆనీటిని బొడ్రాయికి పోశారు. గాంధీసెంటర్ నుంచి ఊరేగింపుగా ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం వెళ్లి పూజలు చేశారు.

శ్రీరామకోటి మహోత్సవాలు ప్రారంభం



గోదాదేవి సహిత శ్రీకృష్ణుని కల్యాణాన్ని జరిపిస్తున్న అర్చకులు



భక్తులకు అనుగ్రహభాషణం చేస్తున్న గంభీరానంద భారతిస్వామీజీ

నందిగామటౌన్(నందిగామ రూరల్): హిందూ సంస్కృతి, సనాతన ధర్మాలను పరిరక్షించాల్సిన బాధ్యత హిందువులందరిపై ఉందని శృంగేరి విరూపాక్ష పీఠాధిపతి గంభీరానంద భారతి పేర్కొన్నారు. పట్టణంలోని సీతారామాంజనేయస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న 72వ శ్రీరామకోటి మహోత్సవాలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన భక్తులకు అనుగ్రహభాషణం చేశారు. రామకోటి గ్రంథాలకు మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ నగరోత్సవం నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు దివి రత్నమాచార్యులు, అధోక్షజా చార్యులు సర్వాంగ సుందరంగా అలంకరించిన ఆలయ ప్రాంగణంలోని కల్యాణ వేదికపై గోదాదేవి సహిత శ్రీకృష్ణుని కల్యాణాన్ని కన్నుల పండువగా జరిపించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో రామనామ సంకీర్తన సంఘం అధ్యక్షుడు దుడ్డు నాగేశ్వరరావు, సంఘ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రికి ఆటో రిఫ్రాక్టోమీటరు అందజేత

నందిగామ టౌన్(నందిగామరూరల్): పట్టణంలోని ఏరియా ప్రభుత్వ ఆస్పత్రికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య సౌజన్యంతో అందజేసిన రూ.1.80లక్షల విలువ చేసే ఆటో రిఫ్రాక్టోమీటరు, ట్రయల్ లెన్స్ బాక్స్‌ను ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ నాగేశ్వరరావు గురువారం కంటి వైద్యురాలు స్వప్నలత శేషుకుమారికి అందజేశారు. ఆస్పత్రికి ఆటో రిఫ్రాక్టోమీటరు అందజేసిన ఎమ్మెల్యే సౌమ్యకు చైర్మన్ కృతజ్ఞతలు తెలియజేశారు. సూపరిండింటెంట్ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

నూతన టెక్నాలజీలో వేగంగా ఔషధ పరిశోధనలు



మాట్లాడుతున్న డాక్టర్ హారిక

లబ్బీపేట(విజయవాడతూర్పు): అభివృద్ధి చెందిన దేశాల్లో ఏఐ వంటి ఆధునిక టెక్నాలజీ ఉపయోగించి నూతన ఔషధ పరిశోధనలు వేగవంతంగా పూర్తిచేస్తున్నట్లు అమెరికాలో క్యాన్సర్‌పై పరిశోధనలు చేస్తూ బిజినెస్ డెవలప్‌మెంట్ లీడర్‌గా సేవలందిస్తున్న డాక్టర్ సబ్బినేని హారిక అన్నారు. నగరంలోని కేవీఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మసీ కళాశాలలో గురువారం ఫార్మా అన్వేషణ్-2025 పేరుతో సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథి హారిక మాట్లాడుతూ నూతన టెక్నాలజీని పరిశోధనలో ఉపయోగించడం ద్వారా తక్కువ సమయంలో సమర్థంగా నిర్వహించవచ్చన్నారు. ఏఐ టెక్నాలజీపై అవగాహన కలిగిన వారికి మంచి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రస్తుత పరిశోధనల్లో ఏఐని ఉపయోగించి త్వరితగతిన పూర్తి చేస్తున్న క్రమాన్ని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎ.సునీత, డాక్టర్ జి.రమణ తదితరులు పాల్గొన్నారు.